# వంశాంకురం

"మాలాగా పదిమందిలో ఒక్కడుగా పుట్టలేదు రాజా. మేమయితే నలుగురు అన్నదమ్ములూ, ఆరుగురు అక్క చెల్లెళ్లూను. చెట్టుకొకడూ పుట్టకొకడూ అన్నట్టుగా పెరిగాము. మా పెద్దన్నయ్య డాక్టరయ్యాడు. తమ్ముడు ఇంజనీరయ్యాడు.

నేను అతి కష్టం మీద బి.కామ్. అనిపించుకుని బ్యాంకులో చేరి, ఇప్పటికి ఆఫీసర్నయ్యాను. మా చిన్నన్నయ్యకు చదువు అబ్బలేదు. వ్యవసాయం చేస్తున్నాడు. మేము ఎలా చదివినా మా ఇంట్లో అమ్మకీ, నాన్నకీ పట్టలేదు. గాలికి తిరిగాము. నువ్వు అలా కాదు ఒక్కగానొక్క కొడుకువి నిన్నుబాగా చదివించాలి. మా అన్నయ్యలా ఒట్టి ఎమ్.బి.బి.ఎస్. కాదు, ఎమ్.డి. ఆ పైన సూపర్ స్పెషాలిటీ చెయ్యాలి. నా ఆశలన్నీ నీ పైనే ఉన్నాయి. ఎంత ఖర్చయినా సరే చదివిస్తాను" అన్నాడు సూర్యనారాయణ.

తండ్రి మాటలు రాజాకి కొత్తకాదు. బాగా చదువుకుని, మంచి మార్కులతో పాసవడం అతనికి కష్టమైన పనీ కాదు.

రాజా తండ్రి మాటలకి తల ఊపాడు. అతనికి టెన్త్ క్లాను పరీక్షలు దగ్గర పడుతున్నాయి. ఒక వైపు చదువుకుంటూనే మరొకవైపు తండ్రి మాటలు వింటున్నాడు.

◆ ◆ ◆

టెన్త్ క్లాను పరీక్షలయ్యాయి. రిజల్ట్స్ వచ్చాయి. రాజా మంచి మార్కులతో పాసయ్యాడు. సూర్యనారాయణ ఆనందానికి అవధుల్లేవు. తన ఫ్రెండ్స్ నీ, రాజా ఫ్రెండ్స్ నీ పిలిచి పార్టీ ఇచ్చాడు.

"ఇంటర్మీడియట్‌లో ఏం చదువుకుందామనుకుంటున్నావు?" పార్టీకి వచ్చిన పెద్ద మనిషి ఒకరడిగారు.

రాజాని తండ్రి జవాబు చెప్పనివ్వలేదు.

"అబ్బాయిని మెడిసిన్‌కి పంపిద్దామనుకుంటున్నానండీ. బ్రిలియంట్ స్టూడెంట్. నాకు ఉన్నది ఒక్కడే కదా. వాడి బంగారు భవిష్యత్తు కన్నా నాకేం కావాలి? వాడి ఫ్యూచర్ కోసం ఏమన్నా చేస్తాను."

"అబ్బాయికి ఏం చదవాలని ఉందో?"

"చిన్నపిల్లాడు, వాడికేం తెలుస్తుందండీ, ఒక్కగానొక్క సంతానం. చిన్నప్పటినుంచీ వాడి భవిష్యత్తుకి నేను ప్లాన్ చేస్తూనే ఉన్నాను. డబ్బుకి ప్రాబ్లం కాకూడదని రికరింగ్ డిపాజిట్స్ వేశాను. వాడి డ్యూటీ ఒక్క చదువుకోవడమే."

పార్టీకి వచ్చిన వారందరూ రాజానీ, సూర్యనారాయణనీ అభినందించి వెళ్లిపోయారు.

❖ ❖ ❖

రాజాకి సిటీలోని మంచి కాలేజీలో సీటు వచ్చింది. నాకు క్లాసులో చెప్పింది బాగా అర్థమౌతోందన్న రాజా మాటలను తండ్రిపట్టించుకోలేదు.

"మనకి డబ్బుకి లోటు లేదు. ఒక్క కొడుక్కి నేను తక్కువ చెయ్య"నంటూ ట్యూషన్ పెట్టించాడు. అన్నిటికన్నా బెస్ట్ కోచింగ్ సెంటర్ అని పేరు తెచ్చుకున్న ట్యుటోరియల్ కాలేజీలో ఎంట్రెన్స్ పరీక్షకి కోచింగ్‌లో చేర్పించాడు.

పొద్దుట నాలుగు గంటలకు నిద్రలేచి ట్యూషన్‌కు వెళ్లడం, ఆ తరువాత కాలేజికి వెళ్లడం. కాలేజి అయ్యాక ఎంట్రెన్స్ కోచింగుకు వెళ్లడం, ఇంటికి వచ్చాక ట్యూషన్‌లో, కాలేజిలో, కోచింగ్ క్లాసెస్‌లో ఇచ్చిన హోమ్ వర్కులను చేసుకోవడం, రాత్రి పన్నెండు గంటలకు పడుకోవడం దినచర్యగా మారింది.

దినచర్యలో ఏనాడూ మార్చలేని అంశం తన మీద తండ్రి ఎన్ని ఆశలు పెట్టుకున్నాడో వినడం. తండ్రిమాటలు వింటూ రాజా తప్పకుండా ఎంట్రెన్స్ పరీక్ష వ్రాసవాలనుకునేవాడు. తనకు ఇద్దరు ముగ్గురు అన్నదమ్ములున్నా బాగుండేది. తను కాకపోతే ఇంకొకళ్ల ద్వారా తండ్రికోరిక తీరేది. ఇప్పుడు తండ్రి ఆశ నెరవేర్చవలసిన బాధ్యత తనమీదనే ఉంది. ఎలాగో ఏమో అన్న భయం అతనిలో అనుక్షణం మెదులుతూ ఉండేది.

❖ ❖ ❖

ఎంట్రెన్స్ పరీక్షా ఫలితాలు వచ్చాయి. రాజారాంక్‌కు ప్రైవేటు మెడికల్ కాలేజీలో కూడా సీట్ వచ్చే అవకాశం లేదు.

రాజా నిలువెల్లా వణికిపోయాడు.

తండ్రి కుప్పకూలిపోయినట్లుగా కూచున్నాడు. రాజాని తిట్టలేదు. రాజాతో మాట్లాడలేదు.

తండ్రి ఆశాసౌధాలన్నీ కూలిపోవడానికి తనే కారకుడినని నిందించుకున్నాడు రాజా. అతనికి జీవితమే వ్యర్థమనిపించింది. నలుగురు పిల్లలున్నా బావుండేది. ఇంకొకళ్లు సూపర్ స్పెషలిస్టు అయి ఉందురేమో.

పిల్లలు ఎక్కువైతే తల్లిదండ్రులు అందరికీ ప్రేమానురాగాలూ, సదుపాయాలూ, అవకాశాలూ ఇవ్వలేరంటారు. బిడ్డలు తక్కువై తల్లిదండ్రులు అన్నీ ఇచ్చినా కష్టమేనా? అతి సర్వత్ర వర్జయేత్ అన్నారు కదా. తల్లిదండ్రులు ఆశాసౌధాలు నిర్మించుకుందుకు బిడ్డలు పునాదిరాళ్లు కాకూడదు సుమా!

(ఆంధ్రప్రభ వీక్లీ)